సాక్షి నిర్మల్
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



చెరువుల్లోకి చేపపిల్లలు..

జిల్లాలో నీలి విప్లవ సంబురం మొదలు కానుంది. ఈ నెల 28 నుంచి ప్రాజెక్టులు, చెరువుల్లో చేపపిల్లలు వదిలేందుకు జిల్లాలోని మత్స్యశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. 8లో ▸

29న యోగా పోటీలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా యోగా. క్రీడల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న అంతరజిల్లా యోగా పోటీలను నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ ముదుల్కర్ తెలిపారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఉదయం 7:30 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అన్ని వయసులవారు పాల్గొనవచ్చని తెలిపారు. ఆధార్ కార్డు, బోనఫైడ్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, రూ.100 ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9491125216 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
31.3 /24.4

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి కర్ణకుమార్

నిర్మల్ రూరల్: పోలీసులు కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా జడ్జి కర్ణకుమార్ సూచించారు. కేసుల నియంత్రణపై జిల్లా కోర్టు సమావేశ మందిరంలో పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపునకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేసులు పరిష్కారంకాని సందర్భంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేలా చూడాలన్నారు. చట్టాల ఆవశ్యకతను వివరించి కేసులు పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి అజేశ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జడ్జి



సరుకులను పరిశీలిస్తున్న జడ్జి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఈద్గాం ఆశ్రమ బాలికల గిరిజన పాఠశాలను జిల్లా జడ్జి కర్ణకుమార్ ఆదేశాల మేరకు జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. బోధకాలు నివారణ మాత్రలు వేసుకోవడంతో పదిమంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో అజయ్‌కుమార్ పాఠశాలలోని హాస్టల్ గదులను పరిశీలించారు. బియ్యం, పప్పు దినుసులు ఇతరత్రా సామగ్రిని తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అస్వస్థత చెందిన విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిబ్బంది రాజలింగం, లింగగౌడ్ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్

కడెం: చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఖానాపూర్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితిన్‌కుమార్ అన్నారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఉడుంపూర్‌లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జితిన్‌కుమార్ హాజరై మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమణారావు, వెంకట్‌మహేంద్ర, బాశెట్టి శివ, ఏఎస్సై భీంరావు, సర్పంచ్ కుర్రలక్ష్మి, ఉప సర్పంచ్ శ్రావణ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



మొక్క నాటుతున్న ఎస్‌ఈ చౌహాన్

కుంటాల: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని ఎస్‌ఈ జేఆర్.చౌహాన్ అన్నారు. మండలంలోని ఓలా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం కోటి వృక్షార్చనలో పాల్గొన్నారు. మొక్కలు నాటి మాట్లాడారు. జిల్లాలో 30 గ్రామాలను దత్తత తీసుకుని మరమ్మతు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ధ్రువీకరణ పత్రాలు కార్యాలయంలో అందజేసి వంద యూనిట్ల విద్యుత్ రాయితీ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, సర్పంచ్ కనీస్ ఫాతిమా, ఎంపీటీసీ కట్ట రవి, భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ శివప్రసాద్, సబ్ ఇంజినీర్ వంశీకుమార్, గ్రామ పెద్దలు శంకర్‌గౌడ్, సదాశివ్‌పటేల్, శ్రీనివాస్‌గౌడ్, గందె ప్రవీణ్‌కుమార్, శివకుమార్, రాజేందర్, వినాయక్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

విదేశీ యువతులు.. తెలుగింటి కోడళ్లు

- ఉమ్మడి జిల్లా అబ్బాయిలను ఇష్టపడుతున్న విదేశీ యువతులు
- తల్లిదండ్రుల సమ్మతితో ఒక్కటవుతున్న ప్రేమపక్షులు...
- పెద్దల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో పెళ్లిళ్లు

నిర్మల్ ఖిల్లా: పెళ్లంటే ఒకప్పుడు అటు ఏడు తరాలు.. ఇటు ఏడు తరాల చరిత్రను చూసి సంబంధాలు కుదుర్చుకునే వారు. క్రమంగా ఆ సంప్రదాయానికి కాలం చెల్లుతోంది. ఉన్నత చదువుల కోసం, వృత్తిరీత్యా స్థిరపడేందుకు విదేశాల బాట పడుతున్న యువత అక్కడే తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుంటున్నారు. ప్రేమించి.. ఇరువైపులా పెద్దలను ఒప్పించి ప్రేమను పెళ్లి పీటల వరకు తీసుకొస్తున్నారు. ఇక్కడి అబ్బాయిలను ఇష్టపడుతున్న విదేశీ యువతులు భారతీయ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకునేందుకు కూడా ఇష్టపడుతున్నారు. తెలుగింటి కోడళ్లుగా మెట్టినింట్లో అడుగు పెడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విదేశీ కోడళ్లపై అమ్మాయిలపై ప్రత్యేక కథనం.

సండే స్పెషల్







అమెరికా అమ్మాయి.. ఆదిలాబాద్ అబ్బాయి...

– (టేలర్ దయానా – అభినయ్‌రెడ్డి)

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ యువకుడు అమెరికాకు చెందిన యువతిని ప్రేమించి గత అక్టోబర్‌లో పెద్దల అంగీకారంతో మనువాడాడు. హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా బంధుమిత్రుల సమక్షంలో మూడుముళ్ల బంధంతో ఏడడుగులు నడిచారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన దేవీదాస్–కళావతి దంపతుల పెద్ద కుమారుడు అభినయ్‌రెడ్డి, అమెరికాకు చెందిన టేలర్ దయానా ప్రేమించుకున్నారు. తమ ప్రేమను ఇరు కుటుంబాల పెద్దలకు తెలియజేశారు. వారి అంగీకారంతో ఇరువురు పెళ్లి చేసుకున్నారు. హైదరాబాద్‌లో ఆదిలాబాద్ అబ్బాయి, అమెరికా అమ్మాయికి చెందిన ఇరుకుటుంబాల పెద్దలు, కొద్దిమంది బంధువులు, స్నేహితుల సమక్షంలో ఘనంగా వివాహం జరిగింది. వధువు తల్లిదండ్రులు, బంధువులు కూడా హాజరై ఆశీర్వదించారు. వధువు తల్లిదండ్రులు, బంధువులు హిందూ సంప్రదాయాలను చాలా ఇష్టపడతారు. భారతీయ వంటకాలు, సంస్కృతి అంటే చాలా ఇష్టమని చెబుతారు. వధూవరులిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

ఒప్పించి.. మెప్పించి.. మనువాడి...

– (హనా,ఆస్ట్రేలియా–నామని కార్తీక్)

ఆస్ట్రేలియాకు చెందిన ఓ అమ్మాయి నిర్మల్ అబ్బాయితో ప్రేమలో పడింది. అక్కడితో ఆగిపోలేదు.. చక్కగా ఆ అబ్బాయిని భారత సంప్రదాయం ప్రకారం పెళ్లాడి, నిర్మల్‌లో తెలుగింటి కోడలిగా అడుగు పెట్టింది. నిర్మల్ శాస్త్రినగర్ కాలనీకి చెందిన నామని పద్మ– సదానందం దంపతుల కుమారుడు కార్తీక్ ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాడు. అక్కడ హనా అనే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. కార్తీక్ సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తుండగా, అమ్మాయి హనా అక్కడే మెడ్‌ల్యాబ్‌లో సైంటిస్టుగా పనిచేస్తోంది. వీరి మధ్య పరిచయం ప్రేమకు దారితీసింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. విషయం పెద్దవాళ్లకు చెప్పి ఒప్పించారు. ఆగస్టు 22న నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో బంధుమిత్రుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ హిందూ సంప్రదాయం ప్రకారం వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టారు. ఈ మహోత్సవానికి వధువు తల్లిదండ్రులు వెరోనికా–డారెన్ దంపతులు సైతం హాజరై హిందూ సంప్రదాయరీతిలో పాల్గొని నూతన జంటను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని టౌన్స్ ప్రిన్సిల్యాండ్స్‌లో కొత్తకాపురం మొదలుపెట్టారు.

గుడిహత్నూర్ అబ్బాయి.. మయన్మార్ అమ్మాయి..

– (కేథరీన్ – గొల్లపల్లి రవికుమార్)

మయన్మార్ అమ్మాయి, గుడిహత్నూర్ అబ్బాయి ప్రేమకు ఎల్లలు లేవని నిరూపించారు. గుడిహత్నూర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన గొల్లపల్లి రవికుమార్‌కు, మయన్మార్‌కు చెందిన కేథరీన్ ప్రేమించుకున్నారు. రవికుమార్ ఆరేళ్ల క్రితం ఖతర్ దేశానికి వెళ్లాడు.. మయన్మార్‌లోని జిన్‌స్వేథేన్ నగరంలో హోటల్ మేనేజ్మెంట్ చేసిన కేథరీన్ కూడా ఖతార్‌లోని హోటల్‌లో ఉద్యోగం చేస్తున్న సమయంలో ఇద్దరికీ పరిచయం ఏర్పడి, అది కాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమకు పెద్దలు కూడా ఆమోదం తెలిపారు. చింతగూడలో సెయింట్ థామస్ చర్చిలో గత ఫిబ్రవరి 6న క్రైస్తవ సంప్రదాయం ప్రకారం వివాహం జరిగింది. ఈ పెళ్లికి అమ్మాయి సోదరుడు క్యాహు థియేన్ హాజరుకాగా, వరుడి తరపున కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హాజరై ఆశీస్సులు అందజేశారు.

యువ ఓటర్ల నమోదుపై దృష్టిపెట్టాలి

- రెండో ఓటరు జాబితా సవరణపై ప్రచారం చేయాలి
- ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: యువ ఓటర్ల నమోదుపై దృష్టిసారించాలని ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల ధ్రువీకరణ, అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటింగ్ టర్న్‌అవుట్ పెంపునకు తీసుకోవాల్సిన చర్యలు, నూతన ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి, జనాభా ఓటర్ల నిష్పత్తి తదితర అంశాలపై కలెక్టర్లకు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల జాబితా వివరాలను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ప్రతీ మండలంలోని తమ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలు సరిగ్గా ఉన్నాయో లేవో సరిచూసుకుని ధ్రువీకరించాలని ఈఆర్‌ఓలను ఆదేశించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓట్లు, డెత్, షిఫ్ట్ అయిన ఓటర్లు లేకుండా బూత్‌స్థాయి అధికారి ధృవీకరించాలన్నారు. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను పాటించాలని తెలిపారు. జిల్లాలోని బూత్‌స్థాయి అధికారుల జాబితా వివరాలు రాజకీయ పార్టీలకు అందించాలన్నారు. బూత్‌స్థాయి ఏజెంట్ల వివరాలు సమర్పించాల్సిందిగా రాజకీయ పార్టీలకు సూచించాలని తెలిపారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులు ముద్రించి అందించాలన్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రిటర్నింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా జనాభా, ఓటర్ల నిష్పత్తి, లింగ నిష్పత్తి, ఓటర్లలో యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించి, వారి నిష్పత్తిపై సమాచారం అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

త్వరలో పస్పుల వంతెన నిర్మాణం



కొట్టుకుపోయిన వంతెన వద్ద వరుణ్‌రెడ్డి



బాలింతకు పండ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి
- రోడ్డుపై గర్భిణి ప్రసవించిన స్థలం పరిశీలన

పెంబి: మండలంలోని పసుపుల గ్రామం వద్ద కడెం వాగుపై త్వరలోనే వంతెన నిర్మిస్తామని కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. గతేడాది భారీ వర్షాలతో వచ్చిన వరద ఉధృతికి వంతెన కొట్టుకుపోయింది. తులసీపేట గ్రామానికి చెందిన గంగమణి అనే మహిళకు గురువారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో వంతెన లేక ఆస్పత్రికి తరలించడం ఆలస్యమై రోడ్డుపై ప్రసవించింది. పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించిన కలెక్టర్ శనివారం కొట్టుకుపోయిన వంతెనతోపాటు గర్భిణి రోడ్డుపై ప్రసవించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ జానుబాయి త్వరగా వంతెన నిర్మించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే వంతెన నిర్మాణం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అనంతరం కోతకు గురైన గుమ్మెన ఎంగ్లాపూర్, యాపలగూడ, దోందారి గ్రామాలకు వెళ్లే రోడ్లను పరిశీలించారు.

బాలింతకు పరామర్శ..

ఖానాపూర్: అంతకముందు రోడ్డుపై ప్రసవించిన బాలింత గంగమణిని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ పరామర్శించారు. తల్లీబిడ్డల క్షేమం అడిగి తెలుసుకున్నారు. బాలింతకు పండ్లు అందించారు. డెలివరీకి వారం ముందే గర్భిణులను ఆస్పత్రులకు తీసుకురావాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట సూపరింటెండెంట్ వంశీమాధవ్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఐఈవో పరశురాం నాయక్



లోకేశ్వరంలో మాట్లాడుతున్న డీఐఈవో పరశురాం

లోకేశ్వరం: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఐఈవో పరశురాం నాయక్ సూచించారు. లోకేశ్వరం జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ తుకారాం, అధ్యాపకులు వినోద్, చిన్నయ్య, విఠల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుంటాలలో త్వరలో తరగతులు..

కుంటాల: ప్రభుత్వం కుంటాలకు మంజూరుచేసిన జూనియర్ కళాశాలలో త్వరలో అడ్మిషన్లు నిర్వహించి తరగతులు ప్రారంభిస్తామని డీఐఈవో పరశురాం నాయక్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు వసతులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా తెడ్డు వనజ మొదటగా దరఖాస్తు చేసుకుంది. ఆయన వెంట సర్పంచ్ దొనికెన సమత, ప్రిన్సిపాళ్లు తుకారాం, గజపల్లి నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, టీఎల్‌జేఏ జిల్లా ప్రెసిడెంట్ కార్గాం వినోద్ కుమార్, ఉపసర్పంచ్ రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి..

- జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం



సిద్దులకుంటలో సాగులో ఉన్న ఆయిల్‌పాం

మామడ: ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తోంది. సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు రాయితీలు ఇస్తోంది. తక్కువ లాభాలు వచ్చే సంప్రదాయ పంటలకు బదులుగా ఎక్కువ లాభాలను ఆర్జించే ఆయిల్‌పాం సాగు చేయాలని వ్యవసాయ, ఉద్యానవన అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పంట సాగుకు అయ్యే వ్యయం అందిస్తుండటంతో సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. జిల్లాలో క్రమంగా పంట సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

ఎకరానికి రూ.4,200

ఆయిల్‌పాం సాగు ఎకరానికి రూ.2,100, అంతర పంట సాగుకు రూ.2,100 అధికారులు రైతులకు అందిస్తారు. ఏటా రూ.4,200 నాలుగేళ్లు ఎకరాకు మొత్తం రూ.16,800 రైతులకు అందిస్తారు. ఎకరం విస్తీర్ణంలో 50 ఆయిల్‌పాం మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఒక్కో మొక్కకు రైతులు రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రూ.173 సబ్సిడీ అందిస్తుంది. ఆయిల్‌పాం సాగుకు బిందుసేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా, ఇతర రైతులకు 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుంది.

నాలుగేళ్లకు దిగుబడి..

వరిసాగుకు అయ్యే నీటిలో ఆయిల్‌పాం సాగుకు 25 శాతం మాత్రమే సరిపోతుంది. నాలుగు సంవత్సరాల తర్వాత దిగుబడి ప్రారంభమవుతుంది. నువ్వులు, పొద్దుతిరుగుడు, వేరుశనగ వంటి నూనె గింజల పంటలతో పోలిస్తే ఆయిల్‌పాం ఆరు రెట్లు అధిక దిగుబడి వస్తుంది. 4 నుంచి 6 సంవత్సరాల వరకు 5 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి, 6వ సంవత్సరం నుంచి ఎకరానికి 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న విస్తీర్ణం....

జిల్లాలో క్రమంగా ఆయిల్‌పాం సాగు పెరుగుతుంది. గతేడాది 1,316 మంది రైతులు 3,572 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశారు. ఈ యేడాది 929 రైతులు 2,200 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేస్తున్నారు. మొత్తం 5,772 ఎకరాలలో ఆయిల్‌పాం సాగవుతుంది.

ఆసక్తి కనబరుస్తున్నారు

జిల్లాలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గతేడాది 3,572 ఎకరాల్లో, ఈ యేడాది 2,200 ఎకరాలలో రైతులు ఆయిల్‌పాం సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు రాయితీలు అందిస్తున్నాం.

– శ్యాంరావ్‌రాథోడ్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

పొనికి వనం కొయ్యబొమ్మలకు ఊతం

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



మొక్క నాటుతున్న వరుణ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్

సారంగపూర్: పొనికి వనాలతో కొయ్యబొమ్మల పరిశ్రమకు ఊతం లభిస్తుందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. కోటి వృక్షార్చనలో భాగంగా మహబూబాఘాట్స్ సమీపంలో ఏర్పాటు చేసిన పొనికి వనంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్, డీఆర్డీవో విజయలక్ష్మితో కలిసి శనివారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే నిర్మల్ కొయ్యబొమ్మల పరిశ్రమకు మంచి గుర్తింపు ఉందన్నారు. అలాంటి ఖ్యాతిగాంచిన కొయ్యబొమ్మల తయారీకి అవసరమైన పొనికి కర్ర లభ్యత స్థానికంగా లేకపోవడంతో దిగుమతి చేసుకుంటున్నారని తెలిపారు. భవిష్యత్‌లో దిగుమతి అవసరం లేకుండా స్థానికంగానే పొనికి మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. పొనికి కర్ర స్థానికంగానే లభ్యమైతే బొమ్మల తయారీదారులకు చేతినిండా పనితోపాటు ముడిసరుకు సమస్యలు ఉండవని అన్నారు. వీటిని సంరక్షించి చక్కగా పెంచి పెద్దచేయాలని డీఆర్డీవోకు సూచించారు. కార్యక్రమంలో సీసీఎఫ్ శరవణన్, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రావిఎరెడ్డి, సర్పంచ్ రామారావు, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, ఐకేఆర్ ఇంటికే..

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



మహిళలతో మాట్లాడుతున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద: వచ్చే ఎన్నికలలో సీఎం కేసీఆర్, మంత్రి ఐకేరెడ్డి ఇంటికి వెళ్లక తప్పదని డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు అన్నారు. వస్తున్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ధర్మారం, పొట్టపెల్లి, కనకాపూర్ గ్రామాల్లో శనివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ధర్మారం గ్రామంలో కోతిదేవుని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే కార్యక్రమాలను వివరించారు. మంత్రి ఐకేరెడ్డి తన కుటుంబ సభ్యులను మండల ఇన్‌చార్జీలుగా నియమించుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ డబ్బుల సంచులతో రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆయన వెంట నాయకులు ప్రతాప్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, ఈటల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రవి, రమేశ్, సాయన్న, భీమన్న తదితరులు ఉన్నారు.

పండుగ వాతావరణంలో కోటి వృక్షార్చన



మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్



కుంటాల ఠాణాలో మొక్క నాటుతున్న ఏఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్/మామడ: స్వాతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సీఎం కేసీఆర్ తలపెట్టిన కోటి వృక్షార్చన కార్యక్రమం శనివారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. నిర్మల్ మున్సిపల్ డంపింగ్ యార్డ్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మొక్కలు నాటారు. మామడ మండల పరిషత్‌కార్యాలయం ఆవరణలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో కమిషనర్ సీవీఎన్.రాజు, ఏఈ హరిభూశణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవీదాస్, మామడ వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, సర్పంచ్ హన్మాగౌడ్, ఎంపీవో గోవర్ధన్, ఈజీఎస్ ఏపీవో శివాజీ పాల్గొన్నారు.

మొక్కలే జీవనాధారం

నిర్మల్‌చైన్‌గేట్ : మానవ జాతి మనుగడకు మొక్కలే ఆధారమని, భవిష్యత్ తరాల వారికి స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అందరూ బాధ్యతగా మొక్కలు నాటాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కోరారు. కోటి వృక్షార్చనలో భాగంగా సఖీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆవరణలో, పోలీస్ శాఖకు సంబంధించిన స్థలాల్లో మొక్కలు నాటామని తెలిపారు. అదనపు ఎస్పీ వీరన్న, ఏవో యూనుస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు రమేశ్, రామకృష్ణ, రాంనిరంజన్, ఆర్‌ఎస్‌ఐలు వినోద్, రవికుమార్, సాయికుమార్, సాయుధ దళ, డీసీఆర్బీ, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనంతో కళకళలాడాలి

కుంటాల: పల్లెలన్నీ పచ్చదనంతో కళకళలాడాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కోటి వృక్షార్చనలో భాగంగా కుంటాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం మొక్కలు నాటి మాట్లాడారు. ప్రభుత్వ సంకల్పం.. ప్రజల భాగస్వామ్యంతో హరితహారం విజయవంతమైందన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారికి మొక్కలు నాటాలని అవగాహన కల్పించాలని కోరారు. ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు కాలుష్య నివారణ కోసం ప్రతీ ఇంట మొక్కలు నాటాలని సూచించారు. ఎస్సై హన్మాండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్, ఏఎస్సైలు రాందాస్, దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నిర్మల్ రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. కోటి వృక్షార్చనలో భాగంగా జిల్లా కేంద్రంలోని కస్బా ఉన్నత పాఠశాల, మంజులాపూర్ హైస్కూల్, రత్నాపూర్ కాండ్లి ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో సెక్టోరియల్ అధికారులు రాజేశ్వర్, ప్రవీణ్, లింబాద్రి, మండల విద్యాధికారి కస్తూరి శంకర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈవో తౌసిఫ్

జైనథ్: లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఏఈవో తౌసిఫ్ అన్నారు. మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో శనివారం గులాబీ రంగు పురుగు ఉధృతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట 45 రోజుల దశలో ఉన్నప్పుడు ఎకరానికి 6–10 లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉధృతిని గమనించాలన్నారు. లింగాకర్షక బుట్టల్లో వరుసగా మూడు రోజులు ఎనిమిది తల్లి రెక్కల పురుగులను గమనించిన లేదా 10శాతం గుడ్డిపూలు గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/దిలావర్‌పూర్: గత సంవత్సరం గ్రామంలో చోటుచేసుకున్న గొడవలో దిలావర్‌పూర్ మండలం కాల్వతండాకు చెందిన మెగావత్ నవీన్ మృతిచెందిన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అధి నేత, ప్రముఖ నటుడు పవన్ కళ్యాణ్ రూ.5లక్షల చెక్కును పంపించగా ఆ పార్టీ నాయకులు నేమూరి శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నవీన్ భార్య సరితకు శనివారం అందించారు. నాయకులు రాజలింగం, దామోద ర్ రెడ్డి, కాల్వతండా సర్పంచ్ రామావత్ రవి, అభిమాన సంఘం నాయకులు శ్రీరాముల శ్రీనివాస్, అంగోత్ టీకాజీ, రవీందర్, మిట్యా, రుపెందర్, డి.రోహిదాస్, ఎం.నవీన్, జె.సురేష్, తరుణ్ ఉన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామానికి చెందిన ఒడ్డొని కల్యాణ్ (28) కొద్దిరోజుల క్రితం దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన మ్యాకల మహేందర్‌తో పాటు గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు గుండెల్లి నర్సింహ తదితరులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా దుబాయ్‌లోని కౌన్సిలెట్ జనరల్ ఆఫ్ ఇండియా ఎంబసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మృతదేహం తరలింపునకు తగిన చర్యలు తీసుకున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు మృతదేహం రాగా హైదరాబాద్‌లోని ఎయిర్‌పోర్ట్ నుంచి స్వగ్రామం వరకు ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో రాజశేఖర్, శేఖర్‌గౌడ్, దుర్గా, శ్రీనివాస్, శరత్, మునీందర్, రాజు, దశరథ్, తదితరులు ఉన్నారు.

నయనం.. ప్ర'దానం'



- ఒకరిగా మరణించి... ఇద్దరిగా జీవించు
- నేత్రదానం చేద్దాం.. చూపునిద్దాం
- జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



కంటి పరీక్షలను చేస్తున్న వైద్యురాలు(ఫైల్)

మంచిర్యాలటౌన్: వ్యక్తి మరణించిన తర్వాత కళ్లు దానం చేస్తే మరొకరి జీవితంలో వెలుగును ప్రసాదిస్తాయి. దాతల కళ్లు పునర్జన్మను సంతరించుకుని అంధకారాన్ని పారదోలే కాంతిపుంజంగా మారుతాయి. అందుకే సర్వేంద్రియానాం నయనం ప్రధానం అంటారు. అంతటి ప్రధానమైన కళ్లను మరణించాక మట్టిపాలు చేసేకంటే దానం చేయడం ఉత్తమం. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఈ నెల 25న ప్రారంభం కాగా సెప్టెంబర్ 8వరకు నిర్వహించనున్నారు. కంటి చూపులేని వారికి ఒకరి నుంచి సేకరించిన రెండు కళ్లలో ఒకటి అమర్చినా, అలా ఇద్దరికి చూపు వచ్చే అవకాశం ఉందని, నేత్రదానానికి ప్రజలు ముందుకు రావాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రచారం కల్పిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 2009 నుంచి 2022 వరకు దాదాపుగా 864 మంది నేత్రదానానికి ముందుకు వచ్చారు.

కార్నియా సేకరణ ఇలా..

నేత్రదానం అనేది 15–20 నిమిషాల్లో పూర్తయ్యే సామాన్య ప్రక్రియ. మరణించిన వారి నుంచి కార్నియాను మాత్రమే తీసుకుంటారు. మనిషి మరణిస్తే ఆరు గంటల్లోగా శరీరం నుంచి కార్నియాను సేకరించాలి. ముందుగా 'ఐ' బ్యాంక్ వారికి సమాచారం ఇవ్వాలి. వారు వచ్చేలోగా నేత్రదాత రెండు కనురెప్పలను మూసివేసి, దూది లేదా మెత్తటి వస్త్రాన్ని వాటిపై కప్పి ఉంచాలి. మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో పెట్టినా ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. వైద్యులు సేకరించిన కార్నియాను 24 గంటల్లోగా అర్హులైన ఇద్దరికి అమరుస్తారు. కాగా, మాక్ కాఫ్‌మన్ ద్రవపదార్థంలో కార్నియాను భద్రపరిస్తే 28 రోజుల్లోగా వాడుకోవచ్చు.

కార్నియా అంధత్వం

కంటి ముందు భాగంలోని నల్లటి భాగాన్ని కప్పి ఉంచే పొరను కార్నియా అంటారు. ఏటా వందల మంది కార్నియా అంధులుగా మారుతున్నారు. వీరిలో 50 శాతం మంది యువతీ, యువకులు, చిన్నపిల్లలే. విటమిన్–ఏ లోపం, పౌష్టికాహార లేమి, ప్రమాదాలు, గాయాలు, శస్త్ర చికిత్సలతో వచ్చే ఇన్‌ఫెక్షన్లతో కార్నియా అంధత్వం వస్తుంది. మనిషికి 50 ఏళ్లు దాటాక కళ్లలో శుక్లాలు వస్తాయి. శస్త్రచికిత్సల ద్వారా చూపు వస్తుంది. కార్నియా అంధత్వానికి నేత్రాల కార్నియా మార్పిడే మార్గం. కార్నియా దెబ్బతిని చూపు కోల్పోయిన వారు రోజురోజుకు పెరుగున్నా, నేత్రదానం చేసేవారు పెరగడం లేదు. నేత్రదానానికి ముందుకు వచ్చిన వారిలో కొందరు మృత్యువాత పడిన సమయానికి వారి కళ్లను దానం చేయలేకపోతున్నారు.

ఎవరు అర్హులు

ప్రమాదవశాత్తు, గుండె జబ్బులు తదితర దీర్ఘకాలిక జబ్బులతో మరణించిన వారు, సహజ మరణం చెందిన వారు నేత్రదానం చేయడానికి అర్హులు. ఏ వయసు వారైనా, కంటి అద్దాలు ధరించిన వారైనా, షుగర్ వ్యాధిగ్రస్తులు, అధిక రక్తపోటు ఉన్న వారైనా మరణానంతరం నేత్రదానం చేయవచ్చు. నేత్రదానం తర్వాత కృత్రిమ కళ్లను మృతుడికి అమర్చుతారు. దీని ద్వారా ఎలాంటి వికృతం ఉండదు. అంతిమ సంస్కారాలకు ఇబ్బంది ఉండదు. 18 ఏళ్లు నిండిన వారు వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానం చేయవచ్చు.

నేత్రదానం చేయాలనుకునే వారు ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ఆసుపత్రి	ఆప్తాలమిక్ అధికారి	సెల్ నంబర్
మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి	జి. శంకర్	98495 78938
లయన్స్ కంటి ఆసుపత్రి, బెల్లంపల్లి	ఎల్. ఎస్. మల్లేశ్	94404 45067
రిమ్స్, ఆదిలాబాద్	జే. లింగేశ్	98665 16995
రిమ్స్, ఆదిలాబాద్	కె. విజయ్ కుమార్	92477 50829
రిమ్స్, ఆదిలాబాద్	తథాగత్	90004 84201
జిల్లా ఆసుపత్రి, నిర్మల్	సిహెచ్. లక్ష్మీకాంత్	94403 85964
శేషన్న చెన్నవార్ కంటి ఆసుపత్రి, మావల	రంజిత	99634 78753
గోపాలరావుపటేల్ కంటిఆసుపత్రి,ముథోల్	సందీప్	08752-254296
జిల్లా ఆసుపత్రి, ఆసిఫాబాద్	బి. వెంకటేశ్	98491 62623

నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నాం



నేత్రదానానికి ప్రజలు ముందుకు వస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు సకాలంలో సమాచారం ఇస్తేనే నేత్రాల సేకరణకు అవకాశం ఉంటుంది. సేకరించిన కళ్లను హైదరాబాద్‌లోని సరోజిని దేవి కంటి ఆసుపత్రికి తరలించాల్సి వస్తుంది. ఐ బ్యాంక్ లేకపోవడంతో నేత్రాలను సేకరించినా భద్రపర్చలేక పోతున్నాం. వేసవిలో కళ్లను సేకరించిన మూడు గంటల్లోపు భద్రపర్చాల్సి ఉంటుంది. ప్రస్తుతం జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చినందున కళ్లను భద్రపరిచేందుకు అవకాశం ఉంది. – డాక్టర్ యశ్వంత్, మంచిర్యాల జిల్లా అంధత్వ నివారణ అధికారి

ఉపాధ్యాయులకు అడహక్ పదోన్నతులు కల్పించాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మురళీ మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మురళీ మనోహర్‌రెడ్డి

నిర్మల్‌రూరల్: బదిలీల కేసు ఇప్పట్లో తేలెలా కనిపించడం లేదని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉపాధ్యాయులకు అడహక్ పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మురళీ మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లుగా పదోన్నతులు, ఐదేళ్లుగా బదిలీలు లేవని, పాఠశాలల్లో విషయ నిపుణుల కొరతతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరి ఎంఈఓ1, ఎంఈఓ 2 పోస్టులు సృష్టించి పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకొని డిప్యూటీ ఈఓ, డైట్ లెక్చరర్, హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గత పీఆర్సీ కాలం జూన్‌తో ముగిసినందున వెంటనే నూతన పీఆర్సీ కొరకు కమిటీని నియమించాలని, కమిటీ రిపోర్టు వచ్చేంత వరకూ మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లోని మూడు డీఏలను విడుదల చేయాలన్నారు. కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఇందులో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్, కోశాధికారి పోల ధర్మరాజ్, నాయకులు చొక్కారావు తోట గంగాధర్, పరమేశ్వర్‌రెడ్డి, వహీద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతిపై అవగాహన



మాట్లాడుతున్న సుప్రీం కోర్టు న్యాయవాది సుభాహిఖాన్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రజ్ఞ భారతి ఆదిలాబాద్ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి పౌర స్మృతి, మానవ హక్కులు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు న్యాయవాది, సామాజిక కార్యకర్త, రచయిత సుభాహిఖాన్ హాజరై మాట్లాడారు. మానవ హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉమ్మడి పౌరస్మృతిలోని అంశాలపై అవగతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ దిశగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ ఎమ్మెల్యే సందీప్‌దుర్వే, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుమలత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినీ రెడ్డి పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంపై భయాందోళన వద్దు



గ్రామ శివారులో ఎలుగుబంటి అడుగులు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

తాంసి: జామిడి, కప్పర్ల గ్రామ శివారులోని పంటచేలలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారి హైమద్‌ఖాన్ ధృవీకరించారు. శుక్రవారం ఉదయం పంటచేలలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గమనించిన కప్పర్ల గ్రామ యువకులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. శనివారం ఎలుగుబంటి సంచరించిన ప్రదేశాలను గ్రామస్తులతో కలిసి అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు. పంటచేలలోని గుర్తులను ఎలుగుబంటి పాదముద్రలుగా గుర్తించి సంచారాన్ని అటవీశాఖ సిబ్బంది నిర్ధారించారు. ఎలుగుబంటి విషయంలో ప్రజలు, రైతులు భయాందోళన చెందవద్దని సెక్షన్ అధికారి హైమద్‌ఖాన్ సూచించారు. పంటచేలకు వెళ్లేటప్పుడు చప్పుడు చేస్తూ వెళ్లాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ పనులు చేసుకోవాలని కోరారు. అడవి జంతువులకు ఎటువంటి హాని తలపెట్టవద్దని కోరారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ సాయికుమార్ ఉన్నారు.

కడెం ప్రాజెక్ట్‌లో గుర్తుతెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై కె.రాజు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, ఈ నెల 25న ప్రాజెక్ట్ కుడి కాలువ తూము వద్ద దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712659525, 8712659523 నంబర్‌లకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడింది. జన్నారం నుంచి వినాయకుడి ప్రతిమను తీసుకుని వస్తున్న ట్రాలీ ఆటో బీర్సాయిపేటలో గుంతలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. విషయాన్ని గమనించిన స్థానికులు ఆటోను లేపారు. రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువుల్లోకి చేపపిల్లలు

- ఈ నెల 28 నుంచి విడుదల మొదలు
- జిల్లాకు 4.75లక్షల చేపపిల్లలు
- జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు, 650 చెరువుల ఎంపిక
- మత్స్యకారులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రణాళిక



నిండుకుండలా కడెం ప్రాజెక్టు

జిల్లా సమాచారం..

జిల్లాలో మొత్తం మత్స్యకార సంఘాలు:	216
మొత్తం సభ్యులు :	12,500
చేప పిల్లలు వదిలే చెరువులు :	650
రిజర్వాయర్లు:	04
జిల్లాలో వదిలే మొత్తం చేప పిల్లలు :	4.75 లక్షలు

లక్ష్మణచాంద: నిర్మల్ జిల్లాలో నీలి విప్లవ సంబురం మొదలు కానుంది. ఈ నెల 28 నుంచి నిర్మల్ జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువుల్లో చేపపిల్లలు వదిలేందుకు జిల్లాలోని మత్స్యశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని మత్స్యకారులకు ఉపాధి కల్పనే ప్రధాన ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నీలి విప్లవం దిశగా అడుగులు వేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 650 చెరువుల్లో, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు మత్స్యశాఖ అధికారులు జిల్లాలోని రిజర్వాయర్లను ఎంపిక చేసి సిద్ధంగా ఉంచారు. ఈ నెల 28నుంచి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపపిల్లలను వదలడానికి నిర్ణయించారు. దీంతో మత్స్య సంపద పెరిగి మత్స్యకారులకు సంవత్సరం పొడవునా ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చేప పిల్లలను విడుదల చేస్తుంది.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు....

నిర్మల్ జిల్లాలోని ప్రాజెక్టుల కింద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కడెం ప్రాజెక్టు కింద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని సారంగాపూర్, భైంసా, తాండ్రా, మూటాపూర్ వంటి గ్రామాల్లో చిన్న చేప పిల్లలను(స్పామ్) తెచ్చి పెంచగా వారి నుంచి మత్స్యశాఖ వారు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

నిర్మల్ జిల్లాలో ఇలా...

నిర్మల్ జిల్లాలో శ్రీరాంసాగర్, కడెం, స్వర్ణ, సుద్దవాగు రిజర్వాయర్లతో పాటు నిర్మల్ జిల్లాలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మొత్తం 650 చెరువులు ఉన్నాయి. వీటిలో 4.75 లక్షల చేప పిల్లలను విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 396 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 216 మత్స్యపారిశ్రామిక సంఘాలు ఉండగా అందులో 12,500 మంది సభ్యులు ఉన్నారు.

చెరువులు, రిజర్వాయర్లకు జియోట్యాగింగ్....

గతంలో కొన్ని చెరువుల్లో చేపపిల్లలు వదలకపోయినా వదిలినట్లు రాసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో చేప పిల్లల వదలడంలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా పారదర్శకంగా ఉండడానికి రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, రిజర్వాయర్లను జియోట్యాగింగ్ చేశారు. ఈ ప్రక్రియతో ఇక నుంచి ఏ చెరువులో ఎన్ని చేప పిల్లలు వదులుతున్నారో తెలుస్తుంది.

సంతోషంగా ఉంది



ఇంతకు ముందు చెరువుల్లో చేపపిల్లలను వదలడానికి వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసేవాళ్లం. కానీ కొద్ది సంవత్సరాల నుంచి ప్రభుత్వమే ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తుంది. ఈసారి కూడా పంపిణీ చేస్తుంది. దీంతో తమకు చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాము. – సాగర్, మత్స్యకారుడు, వద్యాల్

ఏర్పాట్లు పూర్తిచేశాం

నిర్మల్ జిల్లాలో చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి ఈ నెల 28వ తేదీన ప్రారంభించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలోని 650 చెరువులలో చెరువుల్లో, రిజర్వాయర్లలో 4.75 లక్షల చేప పిల్లలను వదలడానికి సిద్ధంగా ఉన్నాం. – నరసింహారావు, ఏడీ, మత్స్యశాఖ, నిర్మల్


రిమ్స్ మెడికల్ కళాశాలలో 62మంది ప్రవేశం



ప్రవేశపత్రం అందిస్తున్న డైరెక్టర్ జైసింగ్

కై లాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రిమ్స్ మెడికల్ కళాశాలలో 2023–24 సంవత్సరానికి ఎంబీబీఎస్ తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ విడతలో 73 సీట్లకు 62మంది ప్రవేశాలు పొందారు. వారికి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రవేశపత్రాలు అందజేశారు.

నిత్యాన్నదాన సత్రంకు విరాళం



విరాళం అందిస్తున్న సంఘం సభ్యులు

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన మున్నూకాపు సంఘం సభ్యులు శనివారం మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మంద లింగన్నకు నగదు అందించారు. కన్కపూర్ మున్నూరు కాపు సంఘం సభ్యులు రూ.51వేలు నగదును అందజేశారు. నాయకులు గంగాధర్, సంఘం సభ్యులు ఉన్నారు.

కూరగాయల సాగులో సస్యరక్షణ

ఎదులాపురం: కూరగాయల పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు ఎం. సునీల్‌కుమార్, ఎం.రఘువీర్, ఏ.రమాదేవి శనివారం తెలిపారు. జిల్లాలో కూరగాయల పంటలు సాగు చేసే గుడిహత్నూర్, తలమడుగు మండలాల్లోని పలు టమాటా, వంకాయ, మిరప, చిక్కుడు పంట క్షేత్రాలను పరిశీలించి పురుగు ఉధృతిని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీని నివారణకు ఎకరానికి 10 చొప్పున పసుపు రంగు, నీలిరంగు జిగురు అట్టలను తోటల్లో అమర్చుకోవడంతో పాటు వేప నూనె (15000 పీపీఎం) 5 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని, టమాటా, వంకాయ పంటల్లో కాయ తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 8 చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడంతో పాటు ఇమామెక్టిన్, బెంజోయేట్ ముందును లీటర్ నీటికి 0.5 గ్రా. చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు.

రాచాపూర్ సబ్‌స్టేషన్‌లో టెక్నికల్ చార్జింగ్ ప్రారంభం



టెక్నికల్ చార్జింగ్ ప్రారంభిస్తున్న మోహన్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ టెక్నికల్ చార్జింగ్‌ను ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని రాచాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ టెక్నికల్ చార్జింగ్‌ను విద్యుత్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సబ్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. టెక్నికల్ చార్జింగ్ వారం రోజుల పాటు చేస్తామన్నారు. వారం రోజుల తరువాత రాచాపూర్ గ్రామానికి, వ్యవసాయ కనెక్షన్‌లకు మొదట సరఫరా చేసే లోడింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో చుట్టుపక్కల గ్రామాలకు, వ్యవసాయదారులకు విద్యుత్ సమస్యలు ఉండవన్నారు. ఇందులో ఎస్ఈ జే.ఆర్ చవాన్, ఈఈ స్వామి, ఏడీఈ ప్రభాకర్, ఏఈఈ శ్రీనివాస్ రావు, ఏడీఈ రంగస్వామి, ఏఈ మహేష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసిన సంఘటన చోటుచేసుకుంది. శనివారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ తీగను దొంగిలించినట్లు తెలుస్తోంది. వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.